సాక్షి మహబూబ్‌నగర్

గురువారం ׀ 24 ׀ జూలై ׀ 2025



ఆర్టీసీలో గ్రాడ్యుయేట్లకు శిక్షణ

ఇంజినీరింగ్ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వాలని ఆర్టీసీ నిర్ణయించింది.

వివరాలు 8లో ▸



జూరాలకు నిలకడగా వరద

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నిలకడగా కొనసాగుతుంది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /22.1

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నీటి ప్రవాహాల వద్ద అప్రమత్తంగా ఉండాలి



జడ్చర్ల: వర్షాలు కురుస్తున్న సందర్భంగా చెరువులు, కుంటలు, వాగుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకి పేర్కొన్నారు. బుధవారం ఆమె లింగంపేట వద్ద దుందుభీ వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయని, పొలాలకు వెళ్లే వారు, ఇతర అవసరాల కోసం వాగులు దాటే వారు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు, ఈత రాని వారు ఇలాంటి ప్రవాహాల వద్దకు వెళ్లడం మంచిది కాదన్నారు. చేపలు పట్టేందుకు కూడా వెళ్లవద్దన్నారు. ప్రజలు సురక్షితంగా ఉండాలన్నదే తమ భావన అని పేర్కొన్నారు. అనంతరం జడ్చర్ల సిగ్నల్‌గడ్డ వద్ద రోడ్డు విస్తరణ పనులను ఆమె పర్యవేక్షించారు. ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి స్థానిక పోలీసులకు తగు సూచనలు జారీ చేశారు. ట్రాఫిక్ జామ్ కాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎస్పీ వెంట సీఐ కమలాకర్, తదితర సిబ్బంది ఉన్నారు.

27న పుస్తక ఆవిష్కరణ సభ

పాలమూరు: పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్ రచించిన శాంతి చర్చలు–ప్రజాస్వామిక అన్వేషణ పుస్తక ఆవిష్కరణ సభ ఈనెల 27న హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ కె.చంద్రకుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి మేధావులు, వక్తలు అధికంగా హాజరుకావాలని కోరారు.

స్థానిక ఎన్నికలకు సంసిద్ధం కావాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధిత అధికారులు సంసిద్ధం కావాలని పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీజ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికల నిర్వహణకు ఆదేశాలు ఇచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. వన మహోత్సవం లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. వీసీలో జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, డీపీఓ పార్థసారథి, అడిషనల్ పీడీ సాయిదాబేగం పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ మేరకు విద్యార్థి సంఘాల నాయకులు పలు పాఠశాలలు, కళాశాలలను మూసివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించలేదని, విద్యారంగ సమస్యలను పరిష్కరించే వారు లేకుండాపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అనేక సమస్యలు ఉన్నా పట్టించుకోవడం లేదని, మూత్రశాలలు, తరగతి గదులు, తాగునీటి సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయని తెలిపారు. స్కాలర్‌షిప్‌లు రూ.8 వేల కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నూతన విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీ తీర్మానం చేయాలన్నారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సీతారాం, భాస్కర్, రాజు, భరత్, లక్ష్మణ్, వెంకటేష్, నాగేష్, సంజీవ్, నర్సింహులు, ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, శ్రీనివాసులు, మల్లేష్, రాజు, రమేష్, నందు పాల్గొన్నారు.

అప్పుడే.. లోకల్ ఫైట్!



ఎమ్మెల్యే అనడం కన్నా.. 1300 ఓట్లతో గెలిచిన గప్షత్ ఎమ్మెల్యే అంటే బాగుంటుంది. అటువంటి ఎమ్మెల్యే కల్లు తాగిన కోతి లాగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన హరీశ్‌రావును విమర్శిస్తున్నాడు. సీఎం రేవంత్‌రెడ్డితో మెప్పు పొందాలనే ఈ విమర్శలు చేస్తున్నాడు.
– దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అవినీతి చిట్టా నా దగ్గర ఉంది. భారీగా ఆస్తులు సంపాదించాడు. పదేళ్లుగా నియోజకవర్గ కేంద్రాన్ని గాలి కొదిలేశాడు.
– దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

జడ్చర్లలో 100 పడకల ఆస్పత్రి వద్ద మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుటుంబసభ్యులు అక్రమంగా తీసుకున్న అసైన్డ్ ల్యాండ్‌ను ప్రభుత్వానికి అప్పగించాలి. సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణకు సంబంధించి పాత బస్టాండ్ వైపు నేరుగా వాహనాలు వెళ్లేందుకు మార్గం లేదు. డిజైన్ లోపంతో ఇబ్బందులు వస్తాయి.
– జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సొంత ఊరు రంగారెడ్డిగూడ దేవాలయం భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి. సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనుల డిజైన్‌లో ఎలాంటి లోపాలు లేవు. పోలేపల్లి సెజ్ నుంచి నా ఖాతాకు డబ్బులు వచ్చాయని ఆరోపణలను రుజువు చేయాలి. లేకపోతే క్షమాపణలు చెప్పాలి.
– లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

స్థానిక ఎన్నికల వేళ వేడెక్కిన రాజకీయం

- షెడ్యూల్ విడుదలకు ముందుగానే చేరికలకు తెరలేపిన పార్టీలు
- ముఖ్య నేతల మధ్య పేలుతున్న మాటల తూటాలు
- గెలుపే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పక్షాల కసరత్తు
- సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో 'హస్తం' ముందడుగు
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా 'కారు' కార్యాచరణ
- పట్టు సాధించాలనే తపనతో 'కమలం'

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ముందుగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు.. ఆ తర్వాత మున్సిపల్, కార్పొరేషన్, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేలా ఎలక్షన్ కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు ఉమ్మడి పాలమూరులోని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ తగిన కసరత్తు ప్రారంభించాయి. గెలుపే లక్ష్యంగా రూపొందించుకున్న ప్రణాళికకు అనుగుణంగా ఆయా పార్టీల ముఖ్యనేతలు పావులు కదుపుతున్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో అధికార పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో ప్రచారం ప్రారంభించగా.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలలను ఎండగట్టే కార్యాచరణతో ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ముందుకు సాగుతున్నారు. మరో రెండు రోజులు లేదంటే ఈ నెలాఖరులోపు ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే అంచనాతో పార్టీల్లో చేరికలు ఊపందుకోగా.. స్థానికంగా సందడి నెలకొంది.

చేరికల పరంపర

స్థానిక ఎన్నికల వేళ ఉమ్మడి పాలమూరులోని పలు నియోజకవర్గాల పరిధిలో వివిధ పార్టీల్లో చేరికలు ఊపందుకున్నాయి. ఇటీవల నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల్లో కాంగ్రెస్ నుంచి పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ నెల 18న బీఆర్‌ఎస్‌కు చెందిన జడ్చర్ల తాజా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం నర్వ మండలానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. తాజాగా మహబూబ్‌నగర్ చెందిన రైతుబంధు జిల్లా సమితి మాజీ చైర్మన్ గోపాల్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ పద్మజ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. వారు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

దేవరకద్ర, జడ్చర్లలో మాటల తూటాలు

దేవరకద్ర నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ఆ తర్వాత ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మధ్య విమర్శల పర్వం నామమాత్రంగా కొనసాగింది. నిన్న, మొన్నటి వరకు రాజకీయ వాతావరణం స్తబ్దుగా ఉండగా.. స్థానిక ఎన్నికలు వస్తాయనే క్రమంలో ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేల మధ్య మాటల తూటాలు మంటలు రేపాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలతో పాటు వ్యక్తిగత విమర్శలతో ప్రస్తుతం రాజకీయ సెగ రాజుకుంది. జడ్చర్ల నియోజకవర్గంలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మధ్య నిత్యం మాటల తూటాలు పేలుతుండగా.. రాజకీయం రసవత్తరంగా మారింది.

ఇటు కాంగ్రెస్.. అటు బీఆర్‌ఎస్

స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ మేరకు ఆయా నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తూ కేడర్‌లో జోష్ నింపుతున్నారు. ప్రధానంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గెలుపు గుర్రాల వడబోత చేపట్టినట్లు తెలుస్తోంది. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మార్నింగ్‌వాక్ పేరిట వార్డుల్లో పర్యటిస్తుండగా.. ఆయన ముఖ్య అనుచరులు మండలాల వారీ సమావేశాలు నిర్వహిస్తూ కేడర్‌లో జోష్ నింపుతున్నారు. నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన ముఖ్య నేతలు, ప్రధాన అనుచరులు మండలాలు, పట్టణాల వారీగా నిత్యం పర్యటిస్తూ.. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు వివరిస్తూ.. ప్రజలకు తెలియజేసేలా ప్రచారం చేపట్టాలని శ్రేణులకు సూచిస్తున్నారు. బీఆర్‌ఎస్ నేతలు సైతం పోటాపోటీగా నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ.. ప్రచారం మొదలుపెట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రజల్లోకి వెళ్లేలా గ్రామ, మండలస్థాయి కీలక నాయకులను సమాయత్తం చేస్తున్నారు. కాగా, జోగుళాంబ గద్వాల జిల్లాకు సంబంధించి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రధానంగా గద్వాల నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌లో అంతర్గత పోరు కొనసాగుతుండడంతో ఆయా పార్టీల శ్రేణుల్లో గందరగోళం నెలకొంది.

బీజేపీ సైతం..

స్థానిక ఎన్నికల్లో ఈ సారి పట్టు సాధించాలనే లక్ష్యంతో బీజేపీ ముందుకు సాగుతోంది. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పార్లమెంట్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో క్రమం తప్పకుండా పర్యటిస్తున్నారు. షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, మక్తల్, నారాయణపేట, దేవరకద్ర నియోజకవర్గ పరిధిలో పలు మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తూ.. కేడర్‌లో జోష్ నింపుతున్నారు.

రేషన్‌కార్డు.. పేదవాడి ఆత్మగౌరవం



కొకుంట్లలో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

- ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అహర్నిశలు కృషి
- మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

దేవరకద్ర రూరల్/చిన్నచింతకుంట: ప్రతి పేద కుటుంబం గుర్తింపు, ఆకలి తీర్చే ఆయుధం రేషన్ కార్డు అని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. కొకుంట్లలో పేదలకు మంజూరైన నూతన రేషన్‌కార్డులను బుధవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి మంత్రి పంపిణీ చేశారు. అంతకు ముందు రూ.1.30కోట్లతో 30 పడకల ఆస్పత్రి, రూ. 21లక్షలతో గ్రామపంచాయతీ భవనం, ఇద్రంపల్లిలో రూ. 32లక్షలతో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కొకుంట్ల పాఠశాలలో నిర్మించిన తరగతి గదులను ప్రారంభించారు. చిన్నచింతకుంట మండలంలో రూ. 2.70కోట్లతో ఉంద్యాల తండాకు బీటీరోడ్డు, కురుమూర్తి స్వామి దేవస్థానంలో రూ. 74లక్షలతో చేపట్టనున్న రేకుల షెడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలకు మంత్రి వాకిటి శ్రీహరి భూమిపూజ చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యార్థం రూ. 34లక్షలతో నిర్మించిన మంచినీటి సంపును ప్రారంభించారు. చిన్నచింతకుంట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని మంత్రి, ఎమ్మెల్యే ఆవిష్కరించి.. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మంత్రి వాకిటి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు మంజూరు చేయడంతో పాటు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు వంటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నిత్యం మంత్రివర్గంతో సమీక్షించి.. విద్య, వైద్యం, తాగు, సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించడంతో పాటు వసతిగృహాల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచామన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేసి ప్రతి విద్యార్థి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో రూ. 100 కోట్లతో కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ వద్ద మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం చిన్నచింతకుంట గంగాభవాని ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు.

■ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో తెలంగాణను బీఆర్‌ఎస్ నాయకులు అన్ని రకాలుగా ధ్వంసం చేశారన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలో వస్తుందని.. మరోసారి మంత్రిగా శ్రీహరి, ఎమ్మెల్యేగా తాను ప్రజలకు సేవ చేస్తామని అన్నారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కురుమూర్తిస్వామి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీల చైర్మన్లు ప్రశాంత్ కుమార్, కథలప్ప, రహిమతుల్ల, తహసీల్దార్ సుందర్‌రాజ్, ఎంపీడీఓ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే మహాలక్ష్మి పథకం గొప్ప విప్లవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన మహాలక్ష్మి పథకం దేశంలోనే ఒక గొప్ప విప్లవం అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సంబరాల కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన చేసి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినట్లు తెలిపారు. ఒక్క ఏడాదిలోనే మహబూబ్‌నగర్‌కు 48 కొత్త బస్సులు కేటాయించారని, వచ్చే ఏడాది మరో 48 బస్సులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ పథకం ప్రారంభమైన వెంటనే బీఆర్‌ఎస్ నాయకులు కడుపు మంటతో ఇష్టానుసారంగా మాట్లాడినట్లు తెలిపారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. మహిళలే మాకు శక్తి, ధైర్యం అని, మీ ఆశీర్వాదం మాకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రాఘవి, భాగ్యలక్ష్మి, శిరీష, అయేషాబేగం, ప్రవళికలకు బహుమతులు అందజేశారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఉన్న గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఇన్‌చార్జి ఆర్‌ఎం కవిత, డిపో మేనేజర్ సుజాత, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, సీజే బెనహర్, అజ్మత్‌అలీ, ఖాజా పాష, అంజద్, రాషెద్‌ఖాన్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి, వేదికపై ఎస్పీ జానకి, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ నరసింహారెడ్డి తదితరులు

- కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశం
- జిల్లా విజిలెన్స్–మానిటరింగ్ కమిటీ సమావేశం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎస్సీ, ఎస్టీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్–మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. భూమి హక్కులకు సంబంధించిన సమస్యల పరిష్కారం, విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరు, కార్పొరేట్ పథకాల్లో పరిమిత సీట్లు కేటాయించాల్సిందేనన్నారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో విద్యార్థులకు పౌష్టికాహారం, పరిశుభ్రత, తాగునీటి, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. అనంతరం ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అంతకుముందు అంబేద్కర్, సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ ఎ.నరసింహారెడ్డి, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, ఎస్సీ అభివృద్ధి శాఖ డీడీ సునీత, మహిళా–శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి జరీనాబేగం, ఏఎస్‌డబ్ల్యూఓలు సుదర్శన్, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో అక్రమాలను సహించం

హన్వాడ: రైతులకు యూరియా పంపిణీలో అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. హన్వాడలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న యూరియా విక్రయ కేంద్రాన్ని బుధవారం జిల్లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా కోసం వచ్చే రైతులకు ఆధార్‌కార్డు ప్రకారం రెండు బస్తాలకు మించి అదనంగా ఇవ్వరాదని సూచించారు. అయితే పలువురు రైతులు ఇష్టారీతిగా యూరియాను తీసుకెళ్లడాన్ని గమనించిన కలెక్టర్.. పీఏసీఎస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూరియా కోసం వచ్చిన రైతుల బయోమెట్రిక్ విధానాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఆమె వెంట ఏడీఏ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సీఎంఓ, ఎంఈఓకు షోకాజ్ నోటీసులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జడ్చర్ల మండలంలోని భవిత కేంద్రాన్ని ఈ నెల 16న విద్యాశాఖ కమిషనర్ యోగితా రాణా, రాష్ట్ర సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్ తనిఖీ చేశారు. అయితే భవిత కేంద్రంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం.. మూడేళ్లుగా రికార్డులను నిర్వహించకపోవడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించకపోవడాన్ని వారు గమనించారు. అంతే కాకుండా అడ్మినిస్ట్రేషన్ పరంగా మంజూరైన సివిల్ వర్క్స్ కూడా అసంపూర్తిగా ఉన్నాయి. ఇందుకు బాధ్యులైన సమగ్రశిక్ష సీఎంఓ బాలుయాదవ్, జడ్చర్ల ఎంఈఓ మంజులాదేవికి ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జరిగిన తప్పిదాలకు సంబంధించి ఇద్దరిపై చర్యలు ఎందుకు తీసుకోవద్దో చెప్పాలని.. వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల టౌన్: ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీ నిమిత్తం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్సీఓ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, బయోసైన్స్ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు, ఫిజిక్స్, బోటని, ఫిజికల్ సైన్స్, సోషల్, కెమిస్ట్రీ, జువాలజీ సబ్జెక్టులకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఈ నెల 26వ తేదీలోగా ఆర్సీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 91211 67319 నంబర్ సంప్రదించాలని తెలిపారు.

స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

- బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వచ్చే స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ పార్టీదే విజయమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి అయితే సంతోషమే కానీ జిల్లాకు ఆయన చేసిందేమి లేదని మండిపడ్డారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ 90 శాతం పూర్తయిందని, మరో పదిశాతం పనులు పూర్తి చేస్తే జిల్లాకు ప్రయోజనం కలుగుతుందన్నారు. 'తెలంగాణ కోసం పోరాటం చేసినం. జైళ్లకు పోయినం. పదేండ్లు తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేసినం. కానీ ముఖ్యమంత్రి ఏం అభివృద్ధి చేయకుండా మాట్లాడితే ఎవరు పడరు.' అని తెలిపారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలందరూ ఐక్యంగా పని చేసి జిల్లా అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పొంతన లేని సమాధానం చెబుతోందని విమర్శించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతున్నారని.. మరికొందరు ఆర్డినెన్సు ద్వారా రిజర్వేషన్ అమలు చేస్తామని అంటూ గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. విద్య, ఉపాధి రంగాల్లో కూడా రిజర్వేషన్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో ఎన్నికలు నిర్వహించాలన్నారు. కేసీఆర్‌ను తిడితే ప్రజలు మెచ్చుకుంటారని అనుకోవద్దని, ముందు సీఎం అభివృద్ధిపైన దృష్టి పెట్టాలన్నారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన ప్రభుత్వంలో కనిపించడం లేదన్నారు. డబ్బులు తీసుకొని ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి నాయకులు రాజేశ్వర్ గౌడ్, గంజి వెంకన్న, శివరాజ్, సుధాశ్రీ, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఇందిర

పాలమూరు: విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవడం, అవగాహన పెంచుకోవడం చేయాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. జిల్లాకేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని బుధవారం న్యాయమూర్తి సందర్శించి స్థానికంగా విద్యార్థులకు అందుతున్న భోజనం, తాగునీరు ఇతర సదుపాయాలను పరిశీలించారు. బాలికలు ఎదుర్కొంటు న్న ఇబ్బందులపై వారి మాట్లాడారు. అనంతరం పలు రకాల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యాహక్కు చట్టం, బాల్య వివాహాలు, లీగల్ సర్వీసెస్ యాక్ట్, పోక్సో చట్టాలను వివరించారు.

క్లుప్తంగా

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

బిజినేపల్లి: భార్య కాపురానికి రాలేదని మనస్థాపం చెందని భర్త చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని మమ్మాయిపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నక్క మైబూస్(32) భార్య అరుణకు మధ్య మనస్పర్థల కారణంగా అరుణ 15 రోజులుగా శాకాపూర్‌లోని తల్లి గారింట్లో ఉంటుంది. ఈ క్రమంలో భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపం చెందిన మైబూస్ గ్రామ శివారులోని పొలాల వద్ద మంగళవారం రాత్రి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మోతిఘన్‌పూర్‌లో గంజాయి పట్టివేత



జడ్చర్ల: బాలానగర్ మండలంలోని మోతిఘన్‌పూర్‌లో గంజాయి విక్రయిస్తుండగా నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు.. బీహార్‌కు చెందిన దినేష్‌సింగ్ మోతిఘన్‌పూర్‌లో అద్దె ఇంటిలో నివా సం ఉంటూ ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇటీవల బీహార్ వెళ్లిన సమయంలో అక్కడి నుంచి కిలో గంజాయిని తీసుకువచ్చి 5 గ్రాముల చొప్పున పాకెట్లను తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.300కు తోటి కార్మికులకు విక్రయిస్తున్నాడు. ఈక్రమంలో తమకు వచ్చిన సమాచారం మేరకు బుధవారం అతని ఇంటిలో తనిఖీలు నిర్వహించి అతని వద్ద నుంచి 250 గ్రాముల గంజాయిని, సెల్‌ఫోన్‌ను స్వాధీన పర్చుకున్నారు. ఈమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. దాడులలో ఎస్‌ఐ నాగరాజు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



రాములు (ఫైల్)

జడ్చర్ల: కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటికి క్యూరింగ్ చేసేందుకు నీరు పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని పోలేపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. పోలేపల్లిలోని బీసీ కాలనీలో గురుకుంట రాములు(28)కు ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు. ఇంటికి చేసిన సిమెంట్ నిర్మాణ పనులకు మోటార్ ఆన్ చేసి క్యూరింగ్ చేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య స్వాతి, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మరణించడంతో మృతుడి కుటుంబం ఒక్కసారిగా దుఃఖసాగరంలో మునిగింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని మంగళవారం రాత్రి విద్యుత్ షాక్ తో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన నరసింహారావు (50) లారీ యజమాని అయినప్పటికీ డ్రైవింగ్ చేస్తారు. కొవ్వూరు నుంచి గోవా రాష్ట్రానికి లారీలో వెళుతూ.. కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో లారీని ఆపి రోడ్డు అవతల ఉన్న పాన్‌షాప్‌కు వెళుతూ.. డివైడర్‌పై ఉన్న కరెంట్ స్తంభానికి ఉన్న వైరు పట్టుకున్నాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడి కుమారుడు సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెళ్లి కావడం లేదని యువకుడి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: పెళ్లి కావడం లేదని మనస్తాపంతో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల మేరకు.. జార్ఖండ్ రాష్ట్రంలోని గిరిడి జిల్లా శిబువాడీ గ్రామానికి చెందిన మెహతాబ్ అన్సారీ (20) నాలుగేళ్లుగా జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని టైల్స్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కళ్లు సరిగా కనపడకుండా పోయాయి. కుటుంబ సభ్యులు మెహతాబ్ అన్సారీకి ఇటీవల పెళ్లి చేసేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో కళ్లు కనబడటం లేదనే కారణంతో పెళ్లి సంబంధా లు కుదురకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి అన్న అఫ్తాబ్ అన్సారీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీలో గ్రాడ్యుయేట్లకు శిక్షణ



వనపర్తి ఆర్టీసీ డిపో..

- అప్రెంటిస్ విధానానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- ట్రాఫిక్ సెక్షన్‌లో 10, మెకానిక్ విభాగంలో 8 పోస్టులు
- ఈ నెల 27వరకు గడువు

నారాయణపేట రూరల్: ప్రజా రవాణా సంస్థ ఆర్టీసీ సరికొత్త నిర్ణయాలతో ప్రజల మనస్సు చూరగొంటుంది. ఇందులో భాగంగా ఇంజినీరింగ్ అభ్యర్థులకు జాతీయ అప్రెంటిస్ పథకం ద్వారా శిక్షణ ఇవ్వాలని తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దరఖాస్తుల స్వీకరణ సైతం మంగళవారం నుంచి ప్రారంభించింది.

మూడేళ్ల కోర్సు

ఇంజినీరింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి అప్రెంటిస్ షిప్ విధానం వరం లాంటిది. ఎంపికైన వారికి పని అనుభవంతో పాటు ఆర్థిక తోడ్పాటును అందించేందుకు మూడేళ్ల కోర్సుగా దీన్ని ప్రవేశపెట్టారు. ముఖ్యంగా రెండు విభాగాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు. సాధారణ డిగ్రీ పూర్తి చేసిన వారికి ట్రాఫిక్ సెక్షన్లో చేర్చుకుంటారు. మెకానికల్ ఇంజినీరింగ్ చేసిన వారికి గ్యారేజీ విభాగంలో తీసుకుంటారు. ఎంపికైన అభ్యర్థులకు ట్రాఫిక్ సెక్షన్‌లో మొదటి సంవత్సరం నెలకు రూ.15 వేలు, గ్యారేజీ విభాగంలో రూ.17 వేలు అందిస్తారు. మూడేళ్ల పాటు సంవత్సరానికి రూ.వెయ్యి చొప్పున అదనంగా గౌరవ వేతనం ఇవ్వనున్నారు.

సేవల మెరుగునకు అవకాశం..

ప్రస్తుతం ఒక్కో డిపోలో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల్లో ఇద్దరు చొప్పున ఉన్నారు. వారిలో ఒకరు మెకానికల్ విభాగం పర్యవేక్షిస్తుండగా.. మరొకరు ట్రాఫిక్ సెక్షన్ చూస్తుంటారు. పని భారం కారణంగా నిర్వహణ గాడి తప్పకుండా చూసుకోవాలని ఆర్టీసీ భావిస్తోంది. అప్రెంటిస్ విధానం అమలుతో ఆ సమస్య కొంతమేర తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు. అసిస్టెంట్ మేనేజర్లకు అప్రెంటిస్ అభ్యర్థులు తోడైతే మెకానికల్, ట్రాఫిక్ విభాగాల నిర్వహణ సులభతరం కానుంది. తద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించొచ్చు.

దరఖాస్తు ఇలా..

ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 27 లోగా ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకొని మహబూబ్‌నగర్ రీజియన్‌ను ఎంపిక చేసుకోవాలి. అభ్యర్థులు 2021 విద్యా సంవత్సరం నాటికి ఇంజినీరింగ్, ఇతర డిగ్రీ కోర్సుల్లో ఉత్తీర్ణత పొంది సర్టిఫికెట్ ఉండాలి. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న పత్రాలను మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయంలో అందజేయాలి. ఉమ్మడి జిల్లాలో మొత్తం పది డిపోల పరిధిలో ట్రాఫిక్ సెక్షన్‌లో పది, మెకానికల్ సెక్షన్‌లో ఎనిమిది పోస్టులను భర్తీ చేయనున్నారు. మొత్తంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ రీజియన్ లో 18మందికి అవకాశం లభిస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఇంజినీరింగ్ అభ్యర్థులు ఆర్టీసీ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రీజియన్ పరిధిలో అన్ని డిపోల్లో అప్రెంటిస్ అవకాశం ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి అర్హులను ఎంపిక చేసి డిపోలకు కేటాయిస్తారు. అన్ని అంశాల్లో నైపుణ్యం సాధించేలా శిక్షణకు ప్రణాళిక సిద్ధం చేశాం.

– సంతోష్‌కుమార్, ఆర్టీసీ ఆర్‌ఎం, మహబూబ్‌నగర్

మోడల్ స్కూల్‌కు కదిలిన యంత్రాంగం



మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు



మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పీఏ మాధవరెడ్డి

- మూత్రశాలలు, మరుగుదొడ్లకు మరమ్మతు
- వారం రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ

సాక్షి ఎఫెక్ట్..

ధన్వాడ: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో హాస్టల్ విద్యార్థినులు పడుతున్న అవస్థలపై బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'మోడల్ స్కూల్.. కంపు కంపు' కథనానికి స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డితో పాటు జిల్లా యంత్రాంగం స్పందించింది. ఎమ్మెల్యే పీఏ మాధవరెడ్డితో పాటు విద్యాశాఖ అధికారులు ఆగమేఘాలపై మోడల్ స్కూల్‌కు చేరుకున్నారు. హాస్టల్ గదులతో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. కలెక్టర్ ఫండ్ రూ.2.5లక్షలతో హాస్టల్ భవనానికి మరమ్మతు చేయించనున్నట్లు డీఈఓ గోవిందరాజులు, ఏఎంఓ శ్రీనివాసులు తెలిపారు. ప్రస్తుతానికి నీటి లీకేజీలకు మరమ్మతు చేయిస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వారం రోజుల్లో విద్యార్థినుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. కాగా, హాస్టల్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలలను బాగు చేయడంతో పాటు నీటి లీకేజీలకు మరమ్మతు చేయించే వరకు తాము హాస్టల్‌లోకి వెళ్లమని విద్యార్థినులు భీష్మించారు. అయితే మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేస్తామని డీఈఓ నచ్చజెప్పడంతో విద్యార్థినులు శాంతించారు. అధికారుల వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, జీసీడీఓ నర్మద, ప్రిన్సిపాల్ గంగమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రహిమన్‌ఖాన్, రఘువేందర్‌రెడ్డి, నరేందర్ ఉన్నారు.

అదుపుతప్పిన బైక్.. వ్యక్తి మృతి



రోడ్డుపై కిషన్ మృతదేహం (ఇన్‌సెట్లో) కిషన్‌నాయక్ (ఫైల్)

బల్మూర్: బైక్ అదుపుతప్పిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మైలారం– అంబగిరి రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాలు.. లింగాల మండలం ఎంసీ తండాకు చెందిన కాత్రావత్ కిషన్‌నాయక్(35) మంగళవారం అచ్చంపేటకు వెళ్లి రాత్రి 11: గంటల సమయంలో స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలోని మైలారం సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి బైక్ బోల్తా పడింది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో కిషన్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, కూమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో అడవిపందులు గుంపు సంచరించినట్లు గుర్తులు ఉన్నాయని వాటి కారణంగానే బైక్ అదుపుతప్పి కిందపడినట్లు స్థానికులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మహేష్ మృతదేహం మూలమళ్ల వద్ద లభ్యం

- న్యాయం చేయాలని ప్రాజెక్టుపై బంధువుల ఆందోళన



ప్రాజెక్టుపై రాస్తారోకో చేస్తున్న మృతుడి బంధువులు

అమరచింత: జూరాల ప్రాజెక్టు రహదారిపై ఆదివారం జరిగిన కారు, బైక్ ప్రమాదంలో నదిలో పడి గల్లంతయిన మహేష్ (23) మృతదేహం ఆత్మకూర్ మండలంలోని మూలమళ్ల శివారులోని కృష్ణానది ఒడ్డున బుధవారం లభ్యమైంది. మహేష్ మృతికి కారణమైన వారిని చట్టపరంగా శిక్షించాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ మృతుడి బంధువులు ప్రాజెక్టు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ధరూర్ ఎస్‌ఐ శ్రీహరి ఘటనా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడారు. తమకు తక్షణమే న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు పట్టుబట్టడంతో ఎస్‌ఐ జోక్యం చేసుకుని అనుమతి లేకుండా రాస్తారోకో చేస్తే కేసులు నమోదవుతాయన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని మృతుడి కుటుంబ సభ్యులకు వివరించారు. పరిహారం గురించి కోర్టులో మాట్లాడుకోవాలని, ఇలా రోడ్డుపై రాస్తారోకో చేయడం సరికాదన్నారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

ట్రాప్ సీసీ కెమెరాకు చిక్కిన చిరుత జాడ



టీడీగుట్టపై డంపింగ్ యార్డు వైపు వెళ్తూ ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత



చిరుతను పట్టుకునేందుకు మరో చోటుకు బోన్‌ను మార్చిన సెర్చ్ బృందం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మూడు వారాలుగా మహబూబ్‌నగర్ పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న చిరుత ట్రాప్ సీసీ కెమెరాకు చిక్కింది. ఈనెల 22న సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఫైర్ స్టేషన్ ఎదురుగా ఉన్న టీడీ గుట్ట గుండుపై కనిపించడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది చిరుత కనిపించిన చోటుకు చేరుకొని సెర్చ్ ఆపరేషన్ కొనసాగించారు. అటవీశాఖ సీఎఫ్ఓ రాములు, డీఎఫ్ఓ సత్యనారాయణలు పరిస్థితిని సమీక్షించి సెర్చ్ బృందాలను అప్రమత్తం చేశారు. ముందుగానే గుట్టపై అమర్చిన ట్రాప్ కెమెరాలకు అదే రోజు సాయంత్రం 6.50 గంటలకు గుట్టపై నుంచి డంపింగ్ యార్డు వైపు వెళుతూ కనిపించింది. దీంతో అటవీశాఖ అధికారులు సెర్చ్ బృందాలను అలర్ట్ చేసి బుధవారం ఉదయం జేసీబీల సాయంతో బోన్‌లను గుట్టపైకి మార్చి.. మరిన్ని ట్రాప్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. డంపింగ్ యార్డ్ వైపు వెళ్లిన చిరుత నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి దాటే అవకాశం లేనందున తిరిగి గుట్టపైనే సంచరిస్తున్నట్లు అటవీశాఖ బృందాలు అంచనా వేస్తున్నాయి. త్వరలో చిరుతను పట్టుకొని తీరుతామని పేర్కొంటున్నారు. తిరుమలదేవుని గుట్ట, గుర్రం గట్టులపై చిరుత సంచరిస్తుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పటికప్పుడు పోలీసు, అటవీ శాఖ బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తూనే ఉన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తిరుమల దేవునిగుట్ట, గుర్రంగట్టు, వీరన్నపేట, కోయిలకొండ క్రాస్‌రోడ్డు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ భయానికి గురికాకుండా సూచనలు చేస్తూనే ఉన్నారు. సెర్చ్ బృందాలకు సవాల్ విసురుతూ బోన్‌లో చిక్కకుండా చిరుత తప్పించుకొని తిరుగుతుంది.

కూలిన పాఠశాల పాత భవనం



వర్షాలకు కూలిన పాఠశాల భవనం

నవాబుపేట: మండల పరిధిలోని కేశరావుపల్లి ప్రాథమిక పాఠశాల పాత భవనం ఇటీవల కురుస్తున్న వర్షాలకు కుప్పకూలింది. పాఠశాలలో కొత్త భవనంలోనే విద్యా బోధన కొనసాగు తుండటంతో పెను ప్రమాదం తప్పిందని వి ద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. పాఠశాల భవనానికి ఆనుకుని ఉన్న పాత భవనం మంగళవారం రాత్రి కూలింది. దీంతో గ్రామస్తులు బుధవారం పరిస్థితిని విద్యాశాఖ అధికారులకు వివరించారు. కాగా కూలిన భవనాన్ని వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులకు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారుల అనుమతులు తీసుకుని శిథిలాలు వెంటనే తొలగిస్తామని ఎంఈఓ నాగ్యానాయక్ పేర్కొన్నారు.

జోగుళాంబ హుండీ ఆదాయం రూ.72 లక్షలు



వచ్చిన ఆదాయాన్ని చూపుతున్న అధికారులు

అలంపూర్: అలంపూర్ ఆలయాల్లో హుండీల లెక్కింపు ద్వారా రూ.72 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి పురేందర్‌కుమార్ తెలిపారు. బుధవారం దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ మదనేశ్వర్ రెడ్డి, కార్యనిర్వాహక అధికారి పురేందర్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కొనసాగింది. 120 రోజుల హుండీని లెక్కించగా.. జోగుళాంబ అమ్మవారి ఆలయాల హుండీలో రూ.6,23,265, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ హుండీలో రూ.9,76,819 వచ్చినట్లు పేర్కొన్నారు. అన్నదాన సత్రం హుండీ ద్వారా రూ.41,142.. క్షేత్ర ఆలయాల హుండీల ద్వారా మొత్తంగా రూ.72,50,619 ఆదాయం సమకూరినట్లు కార్యనిర్వాహక అధికారి వివరించారు. వీటితోపాటు విదేశీ కరెన్సీ, 20 గ్రాముల మిశ్రమ బంగారం, 380 గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్లు చెప్పారు. లెక్కింపులో ఆలయ ధర్మకర్తలు నాగ శిరోమణి, గోపాల్, జగన్మోహన్ నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, జయరాముడు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు, ఎక్స్ అఫీషియో సభ్యుడు ఆనంద్‌శర్మ, ఆలయ అర్చకులు, సిబ్బంది, సేవా సంస్థలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్లలో మూడు డెంగీ కేసులు నమోదు



జడ్చర్ల టౌన్: పుర పరిధిలోని సంజీవయ్య కాలని, కృష్ణారెడ్డినగర్, జవహర్‌నగర్‌కాలనీలో ముగ్గురికి డెంగీ పాజిటివ్ నిర్ధారణ అయిందని అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారి డా. మనుప్రియ తెలిపారు. బాధితుల్లో ఇద్దరు స్థానిక ఏరియా ఆస్పత్రిలో, మరొకరు ఇంటివద్దే చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో బుధవారం ఫీవర్ సర్వే, యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహించారు. రసాయనాలను పిచికారీ చేయగా జిల్లా ప్రోగ్రాం అధికారి డా. భాస్కర్‌నాయక్ పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలని ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సలోమి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, వైద్య, ఆరోగ్యశాఖ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉధృతంగా దుందుభీ.. అదుపుతప్పిన ట్రాక్టర్

తాడూరు: ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండలంలోని సిర్సవాడ వద్ద దుందుభీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో సిర్సవాడ నుంచి మాదారానికి వెళ్లే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల రైతులు ట్రాక్టర్‌లో నదిదాటుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి నదిలో పడింది. గమనించిన స్థానికులు జేసీబీ వాహనం ద్వారా ట్రాక్టర్‌ను బయటకు తీశారు. స్థానికులు మాట్లాడుతూ.. ప్రతిఏటా పరిస్థితి ప్రమాదకరంగా ఉంటుందని, స్థానిక ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరైనట్లు తెలపడం ప్రకటనలకే పరిమితమైందని వాపోయారు. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



లూడో గేమ్‌కు యువకుడి బలి..
మనోవేదనతో తాత మృతి



వెంకటేశ్ (ఫైల్)



బాలప్ప (ఫైల్)

నర్వ: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాన్ని బలి తీసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అతడి మరణంతో తీవ్ర మనోవేదనకు గురైన తాత తనువు చాలించాడు. ఈ విషాదకర ఘటన నారాయణపేట జిల్లా నర్వ మండలం రాయికోడ్‌లో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రాయికోడ్‌కు చెందిన తెలుగు పోతుల వెంకటేశ్ (18) బతుకుదెరువు నిమిత్తం నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. అక్కడ ఓ హోటల్‌లో గార్డెనింగ్ పనిచేసే వాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడిన అతడు.. చేసిన కష్టంతో పాటు అప్పులు చేసి దాదాపు రూ.5 లక్షల వరకు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. చేసిన అప్పులు తీర్చే దారిలేక.. ఇంట్లో చెబుకోలేక ఐదు రోజుల క్రితం హైదరాబాద్‌లోనే క్రిమిసింహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై అక్కడే కేసు నమోదైంది. నాలుగు రోజుల క్రితం మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి ఖననం చేశారు. ఇదిలా ఉంటే, బుధవారం కుటుంబసభ్యులు తమ కులాచారం ప్రకారం మక్తల్‌లో సంత చేసేందుకు వెళ్లారు. ఈ సమయంలో మృతుడి తాత పోతుల బాలప్ప (80) సైతం వెళ్లి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో మనువడి మృతిపై తీవ్ర మనోవేదనకు గురైన అతడు.. ఏడుచుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందాడు. ఐదు రోజుల వ్యవధిలోనే తాత, మనువడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జూరాలను సందర్శించిన డీఐజీ చౌహాన్



జూరాల ప్రాజెక్టును పరిశీలిస్తున్న డీఐజీ చౌహాన్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ఆనకట్టను బుధవా రం జోగులాంబ గద్వాల జిల్లా జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సందర్శించారు. గద్వాల, వనపర్తి ఎస్పీలు శ్రీనివాసరావు, రావుల గిరిధర్‌తో కలిసి జూరాల వద్దకు చేసుకుని వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్షాల దృష్ట్యా ఎలాంటి విపత్తులు ఎదురైనా పోలీస్ శాఖ తగు చర్యలు తీసుకుంటుందన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి వస్తున్న వరద ప్రవాహంతో గద్వాల జిల్లా పరిధిలో 6 గ్రామాలకు, వనపర్తి జిల్లాలో 6 గ్రామాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రేవులపల్లి పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో గద్వాల, వనపర్తి డీఎస్పీలు మొగులయ్య, వెంకటేశ్వర్లు, సీఐలు టంగుటూరు శ్రీను, రవిబాబు, రాంబాబు, ధరూరు, ఆత్మకూరు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ, కారు ఢీ : ఆరుగురికి గాయాలు

ఊర్కొండ: ఆగి ఉన్న లారీని వెనకాల నుంచి కారు ఢీకొన్న ఘటనలో బుధవారం ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా.. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. కల్వకుర్తి–జడ్చర్ల ప్రధాన రహదారిపై ఊరుకొండపేట శివారులోని కాటన్ మిల్ సమీపంలో ఆగి ఉన్న లారీని వెనకాల నుంచి కారు బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురికి తీవ్రగాయాలయినట్లు తెలిపారు. క్షతగాత్రులను రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలంలోని ఏలికట్ట గ్రామానికి చెందిన యాదయ్య, ప్రశాంత్, లింగం, అఖిలాష్, కిరణ్‌గా గుర్తించారు. బాధితులను 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. వారిలో కుమార్, లింగం, యాదయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జూరాలకు నిలకడగా వరద

- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



జూరాల ప్రాజెక్టు 4 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద కాస్త తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం 1.02 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 67వేల క్యూసెక్కులకు తగ్గినట్లు వివరించారు. ప్రాజెక్టు 4 క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా 28,792 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 36,706 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315, భీమా లిఫ్టు–1కు 650, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 69, ఎడమ కాల్వకు 820, కుడి కాలువకు 720, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150, భీమా లిఫ్టు–2కు 750, సమాంతర కాల్వకు 200.. ప్రాజెక్టు నుంచి మొత్తం 69,122 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.398 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

జెన్‌కో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. బుధవారం 11 యూనిట్ల ద్వారా 435 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 149.609 ఎంయు, దిగువలో 178.134 మొత్తం 327.743 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేపట్టినట్లు తెలిపారు.

కోయిల్‌సాగర్‌లో 24.6 అడుగులు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. జూరాల నుంచి వస్తున్న నీటితో సమానంగా నీటి విడుదల కొనసాగడం వల్ల ప్రాజెక్టులో 24.6 అడుగుల మేర నీటిమట్టం వారం రోజులుగా కొనసాగుతుంది. ఎగువన చెరువులు నిండినా, పెద్ద వాగు నుంచి ప్రవాహం వచ్చినా ప్రాజెక్టు త్వరగా నిండే అవకాశం ఉంది. ప్రాజెక్టు అలుగు స్థాయి నీటి మట్టం 26.6 అడుగులు కాగా మరో 2 అడుగుల నీరు వస్తే అలుగు స్థాయికి చేరుతుంది.

సుంకేసుల వద్ద 8 గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంకు వరద క్రమంగా వస్తుండడంతో బుధవారం ఎనిమిది గేట్లను తెరిచి దిగువ కు విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 43వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 36,975 క్యూసెక్కులు దిగువకు 1,540 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదులుతునట్లు పేర్కొన్నారు.